క్లుప్తంగా

అందుబాటులోకి వైద్యుడు కళ్యాణ్



విధుల్లో ఉన్న వైద్యుడు కళ్యాణ్

సాక్షి ఎఫెక్ట్..

యల్లనూరు: కూటమి ప్రభుత్వంపై పలు సమస్యలతో కూడిన తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం గత నెల 26 నుంచి నిరసన కార్యక్రమాలను చేపట్టిన వైద్యులు విధులను బహిష్కరించారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న కాలంలో పీహెచ్‌సీలకు పెద్ద దిక్కు లేక అవస్థలు పడుతున్నారు. 'కూటమి ప్రభుత్వం అలసత్వం పేదలకు పెద్ద కష్టం' అన్న ప్రచురితమైన వార్తకు స్పందించిన జిల్లా కలెక్టరు ఆనంద్, జిల్లా వైద్యాధికారిణి ఈ.బీ.దేవి తక్షణమే పీహెచ్‌సీలకు వైద్యులను కేటాయించారు. యల్లనూరు పీహెచ్‌సీలో బుధవారం డాక్టర్ కళ్యాణ్ విధుల్లో చేరి రోగులకు వైద్యం అందించారు.

కూలీలకు ఈ-కేవైసీ చేయించండి

యల్లనూరు: జాబ్‌కార్డు ఉన్న ప్రతి కూలీకి ఈ-కేవైసీ చేయాలని ఏపీఓ ఓబిరెడ్డి సిబ్బందికి సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందికి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ పండ్ల మొక్కలను కాపాడుకోవాలని రైతులకు తెలియజేయాలన్నారు. సీజన్‌లో అడిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఈసీ సత్యమూర్తి, టీఏలు జయరాం, హరికుమార్‌రెడ్డి, పురుషోత్తంనాయుడు, కుళ్లాయిస్వామి, చంద్రశేఖర్‌రెడ్డి, ప్రసాద్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

తాడిపత్రిటౌన్: పట్టణంలోని నంద్యాల రోడ్డులో ఉన్న శివశంకర్ ఆటోగ్యారేజీలో ద్విచక్రవాహనం చోరీకి గురైంది. బాధితుడు శివశంకర్ తెలిపిన వివరాలు.. 10 రోజుల క్రితం పట్టణానికి చెందిన రాజన్న అనే వ్యక్తి తన ద్విచక్రవాహనాన్ని మరమ్మతు చేయాలని శివశంకర్ ఆటోగ్యారేజీకి తెచ్చాడు. పని ఎక్కువగా ఉండటంతో రాజన్న ద్విచక్రవాహనాన్ని గ్యారేజీ పక్కనే ఖాళీ ప్రదేశంలో ఉంచారు. రెండు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్రవాహనాన్ని ఎత్తుకెళ్లారు. బాధతుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

సౌత్‌జోన్ కబడ్డీ పోటీలకు ఎస్కేపీ విద్యార్థి ఎంపిక



హరికృష్ణ

గుంతకల్లుటౌన్: ఈ నెల 3 నుంచి 7వ తేదీ వరకు కర్ణాటక రాష్ట్రం బెళగావిలోని రాణి చెన్నమ్మ యూనివర్సిటీలో జరిగే సౌత్‌జోన్ కబడ్డీ పోటీలకు గుంతకల్లు ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల(స్వయం ప్రతిపత్తి) మొదటి సంవత్సరం బీఎస్సీ విద్యార్థి సి.హరికృష్ణ ఎంపికయ్యాడు. ఇటీవల ఎస్కే యూనివర్సిటీ స్థాయి కబడ్డీ పోటీల్లో మంచి ప్రతిభను కనబరిచిన హరికృష్ణను సౌత్‌జోన్ పోటీలకు ఎంపిక చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య, పీడీ సురేష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అధ్యాపకులు రవిశంకర్ శర్మ, బాలకృష్ణ, తోటి విద్యార్థులు అతడిని అభినందించారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

గుత్తి రూరల్: మండలంలోని టి.కొత్తపల్లి గ్రామంలో ఓ యువకుడు బుధవారం ఆత్మహత్యకు యత్నించాడు. వివరాలు.. గ్రామానికి చెందిన తవీంద్రను చిన్నపాటి విషయంపై కుటుంబసభ్యులు దండించారు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన యువకుడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. ఇంట్లో అపస్మారక స్థితిలో పడి ఉన్న తవీంద్రను గమనించిన కుటుంబసభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా ధ్వజారోహణం



ధ్వజారోహణం చేస్తున్న అర్చకులు



అలంకరణలో స్వామివారు

తాడిపత్రి రూరల్: ప్రసిద్ధ వైష్ణవ క్షేత్రమైన భూదేవి, శ్రీదేవి సమేత చింతలవెంకటరమణ స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు బుధవారం ధ్వజారోహణ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు మురళిస్వామి ఆధ్వర్యంలో గరుడ చిత్రాన్ని ధ్వజరోహణం చేసి శ్రీవారి బ్రహ్మోత్సవాలకు బ్రహ్మాది దేవతలను ఆహ్వానించారు. అనంతరం అలంకరణ శోభితుడైన స్వామివారు శ్రీదేవి, భూదేవి సమేతుడై పల్లకీలో ఊరేగారు. అంతకు మునుపు స్వామివారి మూలవిరాట్‌కు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దుర్గామాతా పాహిమాం


సాక్షి బృందం: తాడిపత్రి, గుంతకల్లు, శింగనమల నియోజకవర్గాల్లో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం ఆయా నియోజకవర్గాల్లోని ఆలయాల్లో అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించి పూజలు చేపట్టారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.



శింగనమలలో అలంకరణలో దుర్గాదేవి



గుత్తి రూరల్: సేవాఘడ్‌లో మహిషాసురమర్దినిగా జగదాంబ



తాడిపత్రి: బుగ్గ ఆలయంలో రాజరాజేశ్వరిదేవిగా పార్వతీమాత



పామిడిలో మహిషాసుర మర్దినిగా అంబాభవానీ మాత



గుంతకల్లులో రాజశ్యామలాదేవి అలంకరణలో వాసవీమాత



బీకేఎస్‌లో అన్నపూర్ణ దేవిగా ముసలమ్మ తల్లి



గుత్తిలో మధురమీనాక్షిగా వాసవీమాత

ఎంపీపీ సునీతపై అవిశ్వాస తీర్మానం నోటీసు

బుక్కరాయసముద్రం: ఎంపీపీ సునీతపై విశ్వాసాన్ని కోల్పోయామని వెంటనే ఆమెను పదవి నుంచి తొలగించాలని ఎంపీటీసీ సభ్యులు కోరారు. ఈమేరకు బుధవారం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సదాశివానికి బుధవారం అవిశ్వాస తీర్మాన నోటీసును అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే జిల్లా కలెక్టర్, ఆర్డీఓ, జెడ్పీ సీఈఓలకు అవిశ్వాస తీర్మాన నోటీసు అందించారు. ఇదిలా ఉండగా మండలంలో 19 ఎంపీటీసీలు ఉండగా వీటిలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు 13 మంది ఉన్నారు. టీడీపీకి చెందిన ఐదుగురితో పాటు ఎంపీపీ సునీత ఉన్నారు. వైఎస్సార్ సీపీ గుర్తుతో గెలిచి టీడీపీలోకి చేరిన ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం పెట్టాలని ఎంపీటీసీ కాలవ వెంకటలక్ష్మితో పాటు 13 మంది ఎంపీటీసీలు నిర్ణయించుకుని నోటీసును ఎంపీడీఓకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు నామాల శిరీష, బుల్లే సుజాత, వడ్డే రాజ్యలక్ష్మి, భాస్కర్‌రెడ్డి, రాం గోపాల్, ఎర్రినాగప్ప, అంజినరెడ్డి, సాకే జయలక్ష్మి, శివారెడ్డి, కుళ్లాయప్ప, రామచంద్ర, నాగయ్య, తోపాటు జెడ్పీటీసీ భాస్కర్, బీకేఎస్ సర్పంచ్ పార్వతి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



ఇన్‌చార్జ్ ఎంపీడీఓకు నోటీసు అందిస్తున్న ఎంపీటీసీ సభ్యులు

రాష్ట్రస్థాయి పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థులు

గార్లదిన్నె: రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు గార్లదిన్నె మోడల్ స్కూల్ విద్యార్థులు ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ సతీష్ పీఈటీ వెంకటేష్ బుధవారం తెలిపారు. ఇటీవల అనంతపురంలోని జిల్లా క్రీడా అథారిటీ కేంద్రంలో జరిగిన ఎస్‌జీఎఫ్ బాక్సింగ్ జిల్లా స్థాయి పోటీల్లో మోడల్ స్కూల్‌కు చెందిన 11 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరచడంతో నిర్వాహకులు వారిని రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక చేశారు. వీరు ఈనెల 5 నుంచి 7 వరకు తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో జరిగే బాక్సింగ్ పోటీల్లో పాల్గొంటారని ప్రిన్సిపాల్ తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.



పోటీలకు ఎంపికైన విద్యార్థులు

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన

పామిడి/ గుత్తి/ తాడిపత్రి రూరల్/ యాడికి/ గార్లదిన్నె/ బుక్కరాయసముద్రం: పామిడి, గుత్తి, తాడిపత్రి, యాడికి, గార్లదిన్నె, బుక్కరాయసముద్రంలో బుధవారం అధికారులు సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జీఎస్టీ రేట్లను కేంద్ర ప్రభుత్వం తగ్గించిందన్నారు. దుకాణం దారులు వస్తువులను తగ్గించిన జీఎస్టీ ప్రకారం వస్తువులను విక్రయించాలన్నారు. కార్యక్రమాల్లో గుంతకల్లు డీఎల్‌డీఓ విజయలక్ష్మి, ఎంపీడీఓ కే తేజోత్స్న, గుత్తి మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా, డీఈ హేమచంద్ర, ఏఈలు హరి కిరణ్, గోవిందప్ప, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషా, గార్లదిన్నెలో ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, బీకేఎస్‌లో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సదాశివం, ఏఓ శ్యాం సుందర్‌రెడ్డి, యాడికిలో డీటీ శ్రీనివాసులు, ఏఓ మహబూబ్‌బాషా, మండల పరిషత్ ఏఓ నాగేశ్వర రెడ్డి,తాడిపత్రిలో ఏఓ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



గుత్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

'ట్రంప్ టారిఫ్‌లు విధిస్తున్నా మోదీ మౌనమేల?'

గుంతకల్లుటౌన్: భారత్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధిస్తున్న టారీఫ్‌ల వల్ల దేశానికి తీరని నష్టం వాటిల్లే ప్రమాదముందని తెలిసినా ట్రంప్‌ను ప్రధాని మోదీ ప్రశ్నించకపోవడం శోచనీయమని సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప అన్నారు. బుధవారం సీఐటీయూ కాలనీలో ట్రంప్ టారిఫ్ టెర్రరిజం..భారత్‌పై ప్రభావం అనే అంశంపై సదస్సును నిర్వహించారు. నల్లప్ప మాట్లాడుతూ ట్రంప్ టారీఫ్‌ల పెంపు మన దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతాయన్నారు. హెచ్1బీ వీసా, ఫార్మా, ఆక్వా, పత్తి, పొగాకు ఇతర దిగుమతులతో పాటు అనేక రంగాలపై పడటం వల్ల అవి కుదేలయ్యే ప్రమాదముందన్నారు. భారత్‌ను లక్ష్యంగా చేసుకుని ట్రంప్ టారిఫ్‌లు విధిస్తున్నా మోదీ ఎందుకు మౌనంగా ఉన్నారని ఆయన నిలదీశారు. ఈ అంశాన్ని కేంద్రప్రభుత్వం సీరియస్‌గా తీసుకుని దేశ ప్రజలకు నష్టం వాటిల్లకుండా తగు చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. సదస్సులో సీపీఎం పట్టణ కార్యదర్శి మారుతి, నాయకులు రమేష్, తిమ్మప్ప, రాముడునాయక్, డేనియల్, షాకీరా, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప



రోడ్డుపై నిలిచిపోయిన వాహనాలు

గుత్తిలో ట్రాఫిక్ కష్టాలు..

గుత్తి: పట్టణంలోని గాంధీ సర్కిల్, రాయల్ సర్కిల్, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతాల్లో బుధవారం ట్రాఫిక్ పూర్తిగా స్తంభించింది. పెద్ద వాహనాలు రావడం, పండుగ కావడంతో ట్రాఫిక్‌కు అంతరాయం తలెత్తింది. దీంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రోజూ రెండు, మూడు సార్లు ట్రాఫిక్ జామ్‌తో ఇబ్బందులు పడుతున్నట్లు పట్టణ ప్రజలు వాపోతున్నారు. ట్రాఫిక్ క్లియర్ చేయడానికి ఒక్క పోలీసు రావడం లేదు. ఇప్పటికైనా పోలీసులు, మున్సిపల్ అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

కార్మికులకు నిత్యావసరాల పంపిణీ



కార్మికులకు నిత్యావసరాలు అందిస్తున్న నార్పల సర్పంచ్ మన్నీల సుప్రియ

శింగనమల(నార్పల): విజయదశమిని పురస్కరించుకుని పంచాయతీ కార్మికులకు మేజర్ పంచాయతీ సర్పంచ్ మన్నీల సుప్రియ బుధవారం నిత్యావసరాలను పంపిణీ చేశారు. పండుగను సంతోషంగా జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ శైలజ, పంచాయతీ కార్యదర్శి శ్యామల పాల్గొన్నారు.

పామిడి: పట్టణ పంచాయతీ కార్యాలయ ఆవరణలో బుధవారం దసరా పండుగను పురస్కరించుకొని పారిశుధ్య కార్మికులకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. గుంతకల్లు డీఎల్‌డీఓ విజయలక్ష్మి నిత్యవసర వస్తువులు, దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కే తేజోత్స్న, ఈఓ సీ అశ్వర్థనాయుడు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంకు ప్రారంభం

శింగనమల: శింగనమల మరువకొమ్మ వద్ద రుశ్యశృంగముని, శ్రీరంగరాయుల విగ్రహాల ఏర్పాటు స్థలంలో తాగునీటి ట్యాంక్‌ను నిర్వాహకులు ఏర్పాటు చేశారు. బుధవారం భక్తులు ఇచ్చిన వాటర్ ట్యాంక్‌ను ఇన్‌చార్జ్ ఎంపీడీఓ భాస్కర్ ప్రారంభించారు. కార్యక్రమంలో నిర్వాహకులు రాంచరణ్, పెద్దన్న, పెద్ద వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

పాండురంగడుని దర్శించుకున్న ఆర్డీఓ



పాండురంగడుని దర్శించుకున్న ఆర్డీఓ శ్రీనివాస్

పామిడి: పట్టణంలోని చిన్న విఠోబ ఆలయంలో ఉన్న రుక్మిణీ పాండురంగస్వామిని బుధవారం గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాస్ దర్శించుకున్నారు. ఆలయ ఈఓ ఏ క్రిష్ణయ్యతో కలిసి ఆలయ కమిటీ సభ్యులు ఆర్డీఓను సాదరంగా స్వాగతం పలికారు. ఆర్డీఓ స్వామివార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన్ను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి

పెద్దవడుగూరు : ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని గుంతకల్లు ఆర్‌డీఓ శ్రీనివాసులు రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఫిర్యాదుదారులను పిలిపించి సమస్యలను పరిష్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉషారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తికి తీవ్రగాయాలు

శింగనమల(నార్పల): ద్విచక్రవాహనంలో వెళ్తున్న వ్యక్తికి తెగిపోయిన విద్యుత్ తీగ తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు..మండలంలోని రంగాపురంలో బుధవారం ఉదయం గ్రామానికి చెందిన రైతు వెంకటేష్ ద్విచక్రవాహనంలో తోటకు వద్దకు బయలుదేరాడు. మార్గమధ్యంలో హైటెన్షన్ విద్యుత్ తీగలు తెగి వేలాడుతున్నాయి. ఇది గమనించని రైతు యథావిధిగా ముందుకెళ్లాడు. ఒక్కసారి తీగలు చేయికి తాకడంతో విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు వెంటనే ప్రమాదం జరిగిన ప్రదేశానికి వెళ్లి అతడిని అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యుల సూచనల మేరకు బెంగళూరుకు తరలించారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

పెద్దవడుగూరు: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సీడీపీఓ షాజిదాబేగం పేర్కొన్నారు. బుధవారం క్రిష్టిపాడు గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం-2 లో పోషణ మాసం దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పౌష్టికాహారంతోతో కలిగే లాభాలను వివరించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు.

ముగ్గురికి తీవ్రగాయాలు

గార్లదిన్నె: కల్లూరు అగ్రహారం వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు మేరకు కల్లూరు ఇందిరమ్మ కాలనీకి చెందిన మస్తాన్ అనే యువకుడు మరోవ్యక్తితో కలసి బైక్‌పై పామిడి నుంచి కల్లూరుకు బయలుదేరారు. అగ్రహారం ఆంజనేయ స్వామి గుడి ద్వారం వద్దకు రాగానే కల్లూరు నుంచి పామిడి వైపు వెళ్తున్న మరొక ద్విచక్రవాహనం ఎదురుగా ఢీకొంది. ఘటనలో బైక్‌లపై ముగ్గురికి తీవ్రగాయాలు కావడంతో వెంటనే స్థానికులు వారిని 108లో పామిడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు అనంతపురం తీసుకెళ్లారు.

విజయదశమి శుభాకాంక్షలు





కేతిరెడ్డి పెద్దారెడ్డి, , వై.వెంకటరామిరెడ్డి, సాకే శైలజానాథ్

గుంతకల్లుటౌన్: గుంతకల్లు నియోజకవర్గం ప్రజలందరికీ మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వై.వెంకటరామిరెడ్డి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. విజయాలను చేకూర్చే ఆ విజయదుర్గమ్మ ఆశీస్సులతో నియోజకవర్గం పాడిపంటలతో పచ్చగా ఉండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో పండుగను జరుపుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు వైవీఆర్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

శింగనమల: విజయదశమి పండుగను నియోజకవర్గ ప్రజలు సంతోషంగా జరుపుకోవాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్ కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. విజయదశమి ప్రజల జీవితాల్లో ధైర్యం, ఆశ, విజయం తెచ్చి పెట్టాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. కుటుంబసభ్యులతో కలసి పండుగను సుఖ, సంతోషాలతో జరుపుకోవాలని కోరారు.

తాడిపత్రిటౌన్: తాడిపత్రి నియోజకవర్గ ప్రజలకు వైఎస్సార్‌సీపీ శ్రేణులకు మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దసరా పండుగను నిర్వహించుకుంటామని, దుర్గాదేవి అనుగ్రహంతో నియోజకవర్గంలోని రైతులు, ప్రజలు సుఖశాంతులతో విరజిల్లాలని మనసారా ఆ దుర్గామాతను వేడుకుంటున్నట్లు పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆయుధ పూజ

గుంతకల్లుటౌన్: విజయదశమిని పురస్కరించుకుని బుధవారం మున్సిపల్ కార్యాలయంలోని ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ విభాగాల్లో ఆయుధపూజను ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవానీ, ఆర్‌డీఓ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ తదితరులు పాల్గొని ఇంజినీరింగ్ ఉద్యోగులు, కార్మికులు వినియోగించే పరికరాలకు పూజలు చేశారు. దసరా పండుగ ముందు ఆయుధపూజ నిర్వహించడం సంప్రదాయంగా వస్తోందని, చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా విజయదశమి పండుగను జరుపుకోవడం జరుగుతుందన్నారు. అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీదేవి, ఎంఈ ఇంతియాజ్, డీఈలు, ఏఈలు, కౌన్సిలర్లు, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యల్లనూరు: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ రామాంజనేయరెడ్డి ఆధ్వర్యంలో ఆయుధపూజ చేశారు. గన్‌తో పలురకాల ఆయుధాలకు పూజ చేశారు. మండలంలో అంతా మంచి జరగాలని, క్రైం రేట్ పూర్తిగా తగ్గిపోవాలని ఎస్‌ఐ మొక్కుకున్నారు. ఈ కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ శంకర్‌నారాయణ, కానిస్టేబుల్ నరేంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుత్తి: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఆయుధ పూజను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీకి సంబంధించిన ట్రాక్టర్లు, వాటర్ ట్యాంకర్లు, చెత్త బండ్లకు పూజలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, కమిషనర్ జబ్బార్‌మియా, డీఈ హేమచంద్ర, ఏఈలు హరి కిరణ్, గోవిందప్ప, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషా, హెల్త్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

గార్లదిన్నె: స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఎస్‌ఐ గౌస్‌మహమ్మద్ బాషా ఆధ్వర్యంలో విజయదశమిని పురస్కరించుకొని ఆయుధ పూజ ఘనంగా నిర్వహించారు.

పెద్దవడుగూరు : విజయదశమిని పురస్కరించుకొని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ ఆంజనేయులు ఆయుధ పూజ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయంలో ఆయుధపూజ నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ భవాని

అమ్మవారిని దర్శించుకున్న రమేష్‌రెడ్డి

తాడిపత్రి రూరల్: పట్టణంలోని అమ్మవారిశాలలో కన్యకాపరమేశ్వరిదేవిని బుధవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి దర్శించుకున్నారు. దసర శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు ప్రసాదాలను అందజేశారు.



రమేష్‌రెడ్డికి ప్రసాదం అందిస్తున్న నిర్వాహకులు

వాల్మీకి జయంతి వేడుకలను జయప్రదం చేయండి

పామిడి: పట్టణంలో వాల్మీకి మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 7న తలపెట్టిన వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను జయప్రదం చేయాలని సమాఖ్య మండలాధ్యక్షుడు ఎంఎస్ ఈశ్వరయ్య కోరారు. బుధవారం ఆయన పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. 7వ తేదీ ఉదయం 9 నుంచి 10:30 గంటల వరకూ వాల్మీకి విగ్రహం వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం వాల్మీకి ఉత్సవ విగ్రహాల్లో పట్టణ పురవీధుల్లో ఊరేగిస్తామన్నారు.

సిమెంట్ కర్మాగారం వద్ద నిరసన

యాడికి: స్థానిక నిరుద్యోగులకే ఉద్యోగాలు ఇవ్వాలని కోరుతూ కమలపాడు గ్రామానికి చెందిన పలువురు బుధవారం స్థానిక సిమెంట్ కర్మాగారం గేట్ ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోయరెడ్డిపల్లి గ్రామ సమీపంలో ఉన్న సిమెంట్ పరిశ్రమలో స్థానిక యువకులకు ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. సిమెంట్ కర్మాగారం సెక్యూరిటీ అక్కడికి చేరుకుని విషయాన్ని పరిశ్రమ యాజమాన్యానికి తెలుపుతామని తెలియజేయడంతో వారు నిరసన కార్యక్రమాన్ని విరమించారు.

ఘనంగా అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం

పామిడి: పట్టణ భావసార క్షత్రి కళ్యాణమండపంలో పామిడి సీనియర్ సిటిజన్ల ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి గుంతకల్లు డీఎల్‌డీఓ విజయలక్ష్మి, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ సీ షర్మిల, ఎంపీడీఓ కే తేజోత్స్న హాజరై మాట్లాడారు. వృద్ధుల పట్ల ప్రేమ, గౌరవం కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వపరంగా వారికి చేకూరే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్లు ముంటిమడుగు రవీంద్రారెడ్డి, ప్రభాకర్‌రావు, ఆదిరెడ్డి, షేక్ హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఆకాశంలో అద్భుతం



సూర్యుడి చుట్టూ వలయం ఏర్పడిన దృశ్యం

తాడిపత్రిటౌన్: పట్టణంలో బుధవారం ఆకాశంలో అద్భుతం చోటు చేసుకుంది. సూర్యుడి చుట్టూ వలయం ఏర్పడటంతో ప్రజలు ఆసక్తిగా తిలకించారు. ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు సూర్యుడి చుట్టూ వలయం ఏర్పడింది. కొంత మంది ఫోటోలు తీసి సోషల్ మీడియాలో వైరల్ చేయడంతో చాలా మంది బయటకు వచ్చి మరీ సూర్యుడిని చూస్తూ వింత అనుభూతి పొందారు.